క్లుప్తంగా...

కారుణ్య నియామకాలను చేపట్టండి


ఆందోళన చేస్తున్న వీఆర్‌ఓ కుటుంబ సభ్యులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కారుణ్య నియామకాల భర్తీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మరణించిన వీఆర్‌ఓ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం అబిడ్స్ స్టేషన్ రోడ్డులోని సీసీఎల్‌ఏ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. మూడేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఓ కుటుంబ సభ్యులు కారుణ్య నియామకాలను భర్తీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగర వ్యాప్తంగా 178 మంది సభ్యులు ఉన్నారని మూడేళ్లుగా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ స్పందన లేదన్నారు. పది రోజుల్లో కారుణ్య నియామకాలను భర్తీ చేయాలని సీఎం కేసీఆర్ ప్రకటించినప్పటికీ దానిని అమలు చేయకపోవడం ఎంతో బాధాకరమన్నారు. మరణించిన వీఆర్‌ఓ కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రెవెన్యూ శాఖ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

'ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అత్యుత్తమైనది'


పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులతో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

గోల్కొండ: తెలంగాణ పోలీసులు అనుసరిస్తున్న ఫ్రెండ్లీ పోలీసింగ్ అద్భుతమైన ఫలితాలు ఇస్తుందని గోల్కొండ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గోల్కొండ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు స్నేహానికి పెట్టింది పేరు అని అన్నారు. హిందూ ముస్లింల పండుగలు ఇక్కడి వారు అందరూ కలిసి సంబురంగా నిర్వహిస్తారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం గోల్కొండ ప్రాంతానికి దేశ వ్యాప్త గుర్తింపు వచ్చిందని ఆయన అన్నారు. పీస్ అండ్ మైత్రి కమిటీలలో చదువుకున్న యువతీ యువకులు సభ్యత్వం తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ఆబెద్, డీఎంకే చైర్మన్ గులాం మొహియుద్దీన్‌ఖాన్, పాషాబాయ్, బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు ఇమ్రాన్ అలీఖాన్, దళితరత్న ఎస్. రాజు వస్తాద్, పరమానందం, ఆజమ్ ఖాన్, ఇలియాస్ అక్బర్ తదితరులున్నారు.

లోధ్ కులస్తుల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించాలి



అబిడ్స్: లోధ్ కులస్తుల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించాలని మంత్రి గంగుల కమలాకర్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ముఖేష్ సింగ్, పరమేశ్వరీ సింగ్, లోధ్‌సంఘం నాయకులు మహేష్ సింగ్, రాజేష్ సింగ్, యోగేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి

సుల్తాన్‌బజార్: శంకర జయంతి సందర్భంగా శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానం వారి శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయం ముషీరాబాద్‌లో జరిగిన సంగీత కార్యక్రమంలో బాల సుష్మాదేవి, రత్నమాల, వారి శిష్యులు స్వేచ్ఛ, రుద్రా, సిరి, రాజేశ్వరి, విజయలక్ష్మి, సరస్వతి, వేద శివాని, మాధవి, తన్మయి, పవన్ పాల్గొని అలరించారు. ఇందులో శంకరాచార్య రచనలు, అమ్మవారి కీర్తనలు సుశ్రావ్యంగా ఆలపించారు.

తల్లిని కొట్టిన కుమారుడికి మూడు రోజుల జైలు

దబీర్‌పురా: తల్లిని కొట్టిన కేసులో ఓ వ్యక్తికి కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో మీర్‌చౌక్ పోలీసులు నిందితుడిని జైలుకు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎం.ఎ.బాసిత్ అనే వ్యక్తి ఇటీవల తన తల్లిని కొట్టాడు. దీనిపై తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ఎం.ఎ.బాసిత్‌ను అరెస్ట్ చేసి నాంపల్లి 6వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి లక్ష్మణ్‌రావు నిందితునికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పోలీసులు జైలుకు తరలించారు.

ప్రబోధ్ విద్యా సమితికి 75 వసంతాలు

రజాకారులను ఎదురొడ్డి ఆలయం, స్థలం స్వాధీనం


1956లో రహింపురా ప్రబోధ్ గర్ల్స్ హై స్కూల్


ప్రబోధ్ విద్యా సమితి ప్రతినిధులు

- సంఘు సేవకుల సహకారంతో 27 తరగతుల నిర్మాణం
- ఈ నెల 30న ఇంగ్లిష్ మీడియం ప్రారంభం

జియాగూడ: నాడు వయోజన విద్యతో మొదలైె పాఠశాలగా అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రభుత్వ ఏయిడెడ్ పాఠశాలగా ప్రబోధ్ గర్ల్స్ హైస్కూల్ సేవలందిస్తూ 75 వసంతాలు పూర్తి చేసుకుంటుంది. రజాకరులను తరిమికొట్టి ఆలయాన్ని రక్షించిన స్థానికులు ప్రబోధ్ విద్యా సమితి ద్వారా నాటి నుంచి వేలాది మంది విద్యార్థులకు చదువు నేర్పించింది. చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ కొనసాగుతుంది. ప్రబోధ్ విద్యా సమితి ద్వారా నూతనంగా ఈ నెల 30వ తేదీన ప్రబోధ్ హైస్కూల్ ఇంగ్లిష్ మీడియాన్ని కూడా ప్రారంభిస్తుంది.

1966లో బాలికల ఏయిడెడ్ పాఠశాలగా..

1956 ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న శ్రీ శంకర్‌జీ హనుమాన్‌జీ దేవాలయ విశాల ప్రాంగణంలోకి తరలించి గదులను నిర్మించి పాఠశాలను కొనసాగించారు. ఆనాటి నుండి నేటి వరకు దేవాలయ ధర్మకర్తలు, పాఠశాల యాజమాన్యం మధ్య చక్కటి అవగాహనతో ఓ వైపు పాఠశాల, మరోవైపు దేవాయలం అభివృద్ధి పథకంలో నడుస్తుంది. 1966లో ప్రబోధ్ బాలికల ఉన్నత ఏయిడెడ్ పాఠశాల ''ప్రబోధ్ విద్యాసమితి'' గా ఆమోదం లభించింది. 27 తరగతి గదులతో పాఠశాల కొనసాగిస్తుండగా సుమారు 2 వేల మంది విద్యార్థుల సంఖ్య పెరిగింది. చదువుతో పాటు క్రీడారంగంలో ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఖోఖో, కబడ్డీలలో జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించారు. ఇంగ్లిష్ పెంకులతో నిర్మాణమైన పాఠశాల గదులను జీఎస్ ప్రకాష్‌రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్‌ల ద్వారా గదులకు ఆర్‌సీసీ రూఫ్ పడింది. అప్పట్లో మాచర్ల రాజయ్యగౌడ్, గొడిశాల పెంటయ్య గౌడ్, నాటి ఎమ్మెల్యే కేఆర్.కృష్ణస్వామి అందించిన సేవలు చిరస్మరణీయం.

విద్యా సమితి ప్రతినిధులు..

అధ్యక్షులుగా జీఎస్ ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వర్ద జ్ఞానేశ్వర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ప్యాట ప్రదీప్‌కుమార్, గొడిశాల నరేష్ గౌడ్, ఏనుగుల ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి మోహన్‌గౌడ్ కొనసాగుతున్నారు.

నాటి చరిత్ర..

1948లో రహింపురా గౌండ్ల మఠంలో చెట్టుకింద నర్సింహాచారి మాస్టారు వయోజన విద్యను చెబుతుండేవాడు క్రమేణా విద్యార్థులు పెరుగుతుండడంతో అప్పటి సంఘసేవకులు మాచర్ల రాజయ్య గౌడ్, గొడిశాల పెంటయ్య గౌడ్, కేఆర్.కృష్ణస్వామిల సహకారంతో 1950లో 16 మందితో వయోజనులతో ఒకరాత్రి పాఠశాలను సీబీబీ క్వార్ట్స్‌లో ప్రారంభించారు. క్రమేణా బాలబాలికల ప్రయోజనార్థం పాఠశాలను 1951 అద్దె భవనంలో ప్రారంభించారు. సంఘసేవకుల సేవలను గుర్తించిన అప్పటి ప్రభుత్వం 1953లో 214 రూపాయల 10 అణాలు గ్రాంటును మంజూరు చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా రాజయ్యగౌడ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జీఎస్.ఖాన్, అప్పటి కార్పొరేటర్ గంప్ప రామలింగం ప్రత్యేకంగా కృషి చేశారు. అనంతరం కమిటీ అధ్యక్షులుగా ఏనుగుల శ్రీరాములు, గంప్ప రామలింగం కార్యదర్శులుగా కొనసాగారు. అద్దె భవనంలో విద్యబోధనలు పెరుగుతుండగా విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.

30న ఇంగ్లిష్ మీడియం ప్రారంభం..

ప్రబోధ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఈ నెల 30వ తేదీన ప్రబోధ్ హైస్కూల్ ఇంగ్లిష్ మీడియాన్ని ప్రారంభిస్తున్నట్లు స్కూల్ ప్రధాన కార్యదర్శి వర్ద జ్ఞానేశ్వర్ గౌడ్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు స్కూల్ సలహాదారుడు, ఉపాధ్యక్షులు బండారి పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి నూతన భవనం ఇంగ్లిష్ మీడియాన్ని ప్రారంభిస్తారన్నారు.

ఆర్కిటెక్చర్ విద్యార్థులకు అపారమైన ఉపాధి అవకాశాలు


కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కవిత దరియాని రావు

విజయనగర్‌కాలనీ: ఆర్కిటెక్చర్ విద్యార్థులకు దేశ విదేశాలలో అపారమైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని జేఎన్ఏఎఫ్ఏయు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత దరియానిరావు అన్నారు. బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ ఆర్కిటెక్చర్ కళాశాలలో ఐదురోజుల పాటు కొనసాగే అర్బన్ రీజినల్ ప్లానింగ్ ఎగ్జిబిషన్‌ను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. నగరాలు విస్తరించడం మంచిదే కానీ ఇవి క్రమ పద్ధతిలో ప్రణాళికబద్ధంగా నిర్మిస్తే వానలు, వరదలు, అగ్నిప్రమాధాలు, భూకంపాలు, ఇతర ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నష్టని వారణ చేయవచ్చన్నారు. ఆర్కిటెక్చర్, ప్లానింగ్, బీ డిజైనింగ్, బిల్డింగ్ టెక్నాలజీ, సర్వీస్ ప్లానింగ్ తదితర కోర్సులు చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆలోచింప చేశాయి. ప్రకృతి విపత్తుల నుంచి తప్పించుకునే విధానాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్, కో ఆర్డినేటర్ డాక్టర్ శివాంగి నారాయణ్ వాగ్రే, తౌసిఫ్ ఇక్బాల్, ఎస్.రాజు, కృష్ణకిశోర్‌తో పాటు యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'బాలుడి హత్యకు హిజ్రా సమాజానికి సంబంధం లేదు'


మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్ కృష్ణమ్మ తదితరులు

సుల్తాన్‌బజార్: సనత్‌నగర్‌లో జరిగిన బాలుడి హత్యకు హిజ్రా సమాజానికి ఎలాంటి సంబంధం లేదని ట్రాన్స్ జెండర్ కృష్ణమ్మ తెలిపారు. వ్యక్తిగత కారణాల వల్లే ఆ బాలుడి హత్య జరిగి ఉండవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ మేరకు హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈనెల 21న సనత్‌నగర్‌లో 8 ఏళ్ల బాలుడి దారుణ హత్య విషయంలో కొన్ని మీడియా సంస్థల్లో బాలుడిని ఓ హిజ్రా హత్య చేసిందని వచ్చిన వార్త తమ హిజ్రా సమాజాన్ని కలవరపరిచిందన్నారు. హత్య చేసిన అతను కేవలం స్త్రీల వేషధారణ వేసుకొని కొంత సమయం మాత్రమే జీవించే వాడని తెలిపారు. అతనితో తమ సమాజానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ హత్యను అన్ని ట్రాన్స్‌జెండర్స్ సంఘాలు ఖండిస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో వివిధ ట్రాన్స్‌జెండర్స్ సంఘాల ప్రతినిధులు మోనాలిసా, జాస్మిన్, ప్రియ, జోయ, వాణి, శోభ, స్టెల్లా, అవంతిక పాల్గొన్నారు.

మహా సభను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ధర్మా నాయక్

సంతోష్‌నగర్: ఈ నెల 29న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జన జాతర మహా సభలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు ధర్మా నాయక్ అన్నారు. ఆవాజ్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలు అధ్యక్షతన ఐ.ఎస్.సదన్‌లోని ఆలంఖుద్ మీర్ భవనంలో సౌత్ జిల్లా రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురించి సామాజిక న్యాయ సాధనకై వీరు చేసిన కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి శశికళ, డీవైఎఎఫ్ఐ నాయకులు ఎం.రామ్ కుమార్, శ్రీను నాయక్, బి.రఘు, రవి, వెంకటేష్, ఎం.మీనా, శ్రావణ్ కుమార్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ ప్రారంభం


గోల్కొండ స్విమ్మింగ్ పూల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండ ఒవైసీ ప్లే గ్రౌండ్‌లో పూర్తి స్థాయి స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తెచ్చామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన బల్దియా వారు ఏర్పాటు చేసిన ఈత కొలనును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం ఈ స్విమ్మింగ్ పూల్‌ను మజ్లిస్ శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రారంభించడం జరిగిందన్నారు. అయితే కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన కారణంగా ఈ స్విమ్మింగ్ పూల్‌ను రూ.2 కోట్లతో మళ్లీ సిద్ధం చేశామన్నారు. ఇక్కడికి వచ్చే ఔత్సాహిక వారికి అన్ని సౌకర్యాలు కల్పించామని ఆయన అన్నారు. పాఠశాలల విద్యార్థులు సైతం ఈత నేర్చుకోవాలని ఆయన సూచించారు. బాలికల కోసం ప్రత్యేక సమయాలు కేటాయించాలని తాను స్విమ్మింగ్ కోచ్‌లను కోరామన్నారు. స్విమ్మింగ్ పూల్‌కు వచ్చే బల్దియా వెబ్‌సైట్‌పై తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి, గోల్కొండ కార్పొరేటర్ ప్రతినిధులు హారూన్ ఫరాన్, మహ్మద్ బద్రుద్దీన్, సీనియర్ మజ్లిస్ నాయకులు తదితరులున్నారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ యువనేత దేవర వంశీ అన్నారు. గుడిమల్కాపూర్ డివిజన్‌లోని రామచంద్ర కమ్యూనిటీ హాల్‌లో జనహిత్ చారిటబుల్ ట్రస్ట్, డీఎంఎల్ ఫౌండేషన్ వారు సంయుక్తంగా సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది. బుధవారం ఆయన సమ్మర్ క్యాంపును సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 5 నుంచి 10 సంవత్సరాల బాలబాలికల కోసం క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని, మానసిక, శారీరక శిక్షణ ఇస్తామని నిపుణులైన వారిని ఈ క్యాంపులో శిక్షకులుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మంత్రి కేటీఆర్‌కు జ్ఞాపిక అందజేత


కేటీఆర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నరేందర్

అబిడ్స్: మంత్రి కేటీఆర్‌కు బాబూ జగ్జీవన్ రామ్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కొమ్ముల నరేందర్ జ్ఞాపికను అందజేశారు. సచివాలయం, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భారీ విగ్రహంతో కూడిన జ్ఞాపికను మంత్రి కేటీఆర్‌కు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయానికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేరును నామకరణం చేయడం దేశంలోనే రికార్డు అని చైర్మన్ కొమ్ముల నరేందర్ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కృతజ్ఞత సభను పెద్ద ఎత్తున నిర్వహించడం గర్వకారణమన్నారు. కొమ్ముల నరేందర్ బాబూ జగ్జీవన్‌రామ్ సొసైటీ పేరు మీద చేస్తున్న సేవా కార్యక్రమాలు అమోఘంగా ఉన్నాయన్నారు.

మహా భారతంలో మగువలు



గన్‌ఫౌండ్రీ: రసరంజని సంస్థ ఆధ్వర్యంలో 'మహాభారతంలో మగువలు' అనే నాటకాన్ని బుధవారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. నాటి సమాజం నుంచి నేటి సమాజం వరకు స్త్రీల దృక్పథం, స్వేచ్ఛ అనే అంశంపై ప్రదర్శించిన నాటకం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, రసరంజని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చార్మినార్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. కులీ కుతుబ్ షా స్టేడియంలో బుధవారం జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపును ఆయన ఎమ్మెల్సీలు మీర్జా రహమత్ బేగ్, మీర్జా రియాజుల్ హసన్ హఫందీలతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆటలు వ్యక్తి మానసిక ఆరోగ్యాన్ని పెంచుతాయన్నారు. ఇది ఒక వ్యక్తి స్పాంటెనిటీ, ప్రతిస్పందన సమయాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. మార్చ్ ఫాస్ట్‌లో మొదటి ప్రైజ్ చందులాల్ బారాదరి సాలార్-ఏ-మిల్లత్, రెండో ప్రైజ్ దారుషిఫా ఫుట్‌బాల్ టీమ్, మూడో ప్రైజ్ మంజుమియా తబడా వాలీబాల్, కన్సోలేషన్ ప్రైజ్ మహిపాల్ కరాటే టీమ్ పొందారు. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపులో బాల్ బ్యాడ్మింటన్, షటిల్, బ్యాండ్మింటన్, బాడీ బిల్డింగ్, బాక్సింగ్, క్యారం, చెస్, క్రికెట్, కరాటే, కిక్ బాక్సింగ్, ఫుట్‌బాల్, స్కేటింగ్, తైక్వాండో, వాలీబాల్‌లలో కోచ్‌లు శిక్షణ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అశోక్ సామ్రాట్, డిప్యూటీ కమిషనర్ సూర్య కుమార్, డీఈ శ్రీనివాస్, గేమ్స్ ఇన్‌స్పెక్టర్ రవు అలీ, ఇంతియాజ్, హరిదాసు, మల్లేష్ పాల్గొన్నారు.

మూడు కొత్త రూట్లలో బస్సు సర్వీసులు

చాంద్రాయణగుట్ట: మూడు కొత్త రూట్లలో బస్సు సర్వీసులను నడపనున్నట్లు చేయనున్నట్లు ఫలక్‌నుమా ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ ఓ తెలిపారు. చార్మినార్ నుంచి వెంకటాపురం (85వి), చార్మినార్ నుంచి సులేమాన్‌నగర్ (94సి/70), చార్మినార్ నుంచి మహ్మద్ నగర్ (85క్యూ) రూట్లలో ప్రయాణికుల సౌకర్యార్థం నడుపుతున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని బస్సు సర్వీసులను ఆదరించాలన్నారు.

ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు ప్రారంభం


ఉత్సవాలను ప్రారంభించిన ఆచార్య తంగెడ కిషన్‌రావు

నాంపల్లి: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను నాలుగు రోజుల పాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 29వ తేదీ వరకు నాంపల్లిలోని తెలుగువర్సిటీ ప్రధాన ప్రాంగణంలో కొనసాగుతాయి. ఈ సందర్భంగా సమాలోచన సదస్సులు, విద్యార్థులకు పోటీలు జరుగుతాయి. మొదటి రోజు బుధవారం ఉదయం 10.30 గంటలకు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్‌తో కలిసి ప్రారంభించి ప్రసంగించారు. ఎన్టీఆర్ తెలుగు భాషా సంస్కృతికి పర్యాయపదంగా నిలుస్తారని కీర్తించారు. ఆయన ఆశయసిద్ధి దిశగా విశ్వవిద్యాలయం విస్తరిస్తున్నదని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ మానస పుత్రిక తెలుగు విశ్వవిద్యాలయమని, వారే ప్రథమ చాన్సలర్‌గా పనిచేసి విశ్వవిద్యాలయ నిర్మాణ రూపశిల్పి అయ్యారని, వారి శత జయంతి ఉత్సవాలను నిర్వహించుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. సభా ప్రారంభంలో విశ్వ విజేత తారక రామారావు డాక్యుమెంటరీని ప్రదర్శించారు.

ఎన్టీఆర్ నటనా వైదుష్యంపై సదస్సు..

మొదటి సదస్సులో భాగంగా సమావేశ మందిరంలో డాక్టర్ తారక రామారావు నటనా వైదుష్యం-సమాలోచన అనే అంశంపై ప్రముఖ చలన చిత్ర విమర్శకులు ఎస్.వి.రామారావు అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఆచార్య తంగెడ కిషన్ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కమ్యూనికేషన్, జర్నలిజం శాఖ ఆచార్యులు ఆచార్య సుధీర్‌కుమార్ సమన్వయం చేసిన సదస్సులో ప్రముఖ రచయిత డాక్టర్ వీవీ.రామారావు-పౌరాణిక చిత్రాలు, ప్రముఖ రచయిత ఎం.బి.ఎస్.ప్రసాద్-జానపద చిత్రాలు, దర్శకుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ-చారిత్రాత్మక చిత్రాలు, చరిత్రకారిణి పి.జ్యోతి-సాంఘిక చిత్రాలు అనే అంశాలపై వక్తలుగా హాజరై ప్రసంగించారు.

ఆకట్టుకున్న ఎన్టీఆర్ ఛాయాచిత్ర ప్రదర్శన..

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు, నిర్మాణ రూపశిల్పి డాక్టర్ నందమూరి తారక రామావు విశ్వవిద్యాలయం ప్రగతికి నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భాలను వివరిస్తూ రూపొందించిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఎన్టీఆర్ కళా మందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ ఛాయాచిత్ర ప్రదర్శనను వీసీ ఆచార్య తంగెడ కిషన్‌రావు, పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య అనుమాండ్ల భూమయ్య, పీఠాధిపతి ఆచార్య వై.రెడ్డి శ్యామల వీక్షించారు. ఈ ప్రదర్శన ఏప్రిల్ 29వ తేదీ వరకు ఉంటుంది.

డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి గురు సత్కారం


డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి గురు సత్కారం చేస్తున్న దృశ్యం


మద్దాళి ఉషా గాయత్రి శిష్యురాళ్ల నృత్య ప్రదర్శన దృశ్యం

నాంపల్లి: నృత్య కిన్నెర హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో హంస పురస్కార గ్రహీత, నృత్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి బుధవారం రాత్రి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా మందిరంలో శిష్యురాళ్లచే గురు సత్కారం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ సత్కార సభకు ముఖ్యఅతిథిగా తెలుగు వర్సిటీ పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎన్. గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా నృత్య కళాకారులు, డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి శిష్యురాళ్ల శ్రీవాణి భవానీ, నీరజ, లక్ష్మీశ్రీ, ఉజ్వల, శ్రావ్య, తన్మయి, శర్వాణి, అనసూయ, గాయత్రి, గీతాలి, నూత్న, అనన్య, రసజ్ఞచే నృత్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి ఘనంగా గురు సత్కారం చేశారు. సభా ప్రారంభంలో నృత్య కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు రసవత్తరంగా సాగాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత కళాకృష్ణ, తెలుగు వర్సిటీ నృత్య శాఖ అధిపతి డాక్టర్ వనజా ఉదయ్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ అనగాని మంజుల పాల్గొన్నారు.

సమాజ సేవకు ఉచిత వైద్య శిబిరాలు దోహదం


ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ సుశీల, డాక్టర్ కార్తిక్ మర్రిపెద్ది

అబిడ్స్: సమాజ సేవకు ఉచిత వైద్య శిబిరాలు దోహదపడుతాయని విజయమేరి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల పేర్కొన్నారు. విజయమేరి ఆస్పత్రి, ఈద్ సొసైటీల ఆధ్వర్యంలో బుధవారం ఆస్పత్రి ఆడిటోరియంలో ఉచిత యూరాలజీ క్యాంప్‌ను ఆమె ప్రారంభించి ప్రసంగించారు. విజయ మేరి ఆస్పత్రి ఆధ్వర్యంలో తరచూ పలు విభాగాల ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఉచిత సేవలు అందిస్తున్నట్లు వివరించారు. యూరాలజీ వైద్య శిబిరం ద్వారా కిడ్నీ సమస్యలు, మూత్ర సమస్యలు, డిఫికల్ట్ యూరినేషన్, బ్లాడర్ ప్రొస్టేటిక్ తదితర సమస్యలపై ఉచితంగా వైద్య సేవలందించి ఉచిత రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. డాక్టర్ కార్తిక్ మర్రిపెద్ది మాట్లాడుతూ.. ఉచిత యూరాలజీ క్యాంపు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తరచూ విజయమేరి ఆస్పత్రిలో ఇలాంటి ఉచిత యూరాలజీ క్యాంప్‌ను నిర్వహించి పేద, బడుగు వర్గాల ప్రజలకు సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు.

ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ నూతన అధ్యక్షుడిగా భాస్కర్ రాజ్


మాట్లాడుతున్న భాస్కర్ రాజ్


చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీకి నూతన అధ్యక్షుడిగా ఆలె భాస్కర్ రాజ్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కమిటీ అధ్యక్షుడిగా కొనసాగిన రాకేష్ తివారీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించారు. గౌలిపురా కోట మైసమ్మ ఆలయానికి చెందిన ఆలె భాస్కర్ రాజ్ ఇప్పటికే 2011, 2015లలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీకి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఆయన ముచ్చటగా మూడోసారి 2023లో అధ్యక్షుడిగా తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఈసారి ఆషాడమాసం బోనాల జాతర ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించడానికి అందరి సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, మధుసూదన్‌గౌడ్‌తో పాటు మల్లేశంగౌడ్, ప్యారసాని వెంకటేష్, మామిడి కృష్ణ, ఆనంద్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి


సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

అబిడ్స్: ప్రజా సమస్యలను అన్ని శాఖల అధికారులు పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. భారీ వర్షానికి అవస్థలు పడిన జాంబాగ్ డివిజన్‌లోని సుభాన్‌పురా, యూసుఫ్ బాబా దర్గా ప్రాంతాల్లో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వర్షపు నీరు సక్రమంగా పోయే విధంగా ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. జీహెచ్ఎంసీతో పాటు విద్యుత్, వాటర్‌బోర్డు అధికారులు తరచూ పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన పనిచేయాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందుకుమార్, బిజ్జుకుమార్ జైస్వాల్, మహ్మద్ అన్వార్, మహ్మద్ రఫీక్, మహ్మద్ ఆజాం, మహ్మద్ సలీం, జహంగీర్, అఫ్రోజ్, దస్తగిరి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వజ్రోత్సవాలు



యాకుత్‌పురా: హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం 75వ వార్షిక బోనాల వజ్రోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలతో బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన మధ్యాహ్నం మహా హారతి నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రార్థన మందిరంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వజ్రోత్సవాలను పురస్కరించుకొని ప్రతిరోజూ ఆలయంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు, ప్రార్థన మందిరంలో 75 రోజుల పాటు అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ భరత్‌ప్రకాశ్, ప్రతినిధులు రాజారత్నం, రాందేవ్ అగర్వాల్, దత్తాత్రేయ, సతీష్, కృష్ణ పాల్గొన్నారు.